# ఎంత గొప్ప వాడివిరా.....!

నీ హృదయం ద్రవించి ఎన్నాళ్లయింది. ఎన్నేళ్లయింది?

గుర్తు లేదు కదూ!

మిడిగుడ్లేసుకొని ఎందుకలా చూస్తున్నావు?

నువ్వే నేను, నేనే నువ్వు. సరేనా?




నువ్వు లేని నేను లేను అంటూ కాలేజీ రోజుల్లో మిత్రలాభం కథలు చెప్పిన నువ్వు 'నేను'గా మారిపోయావు. మనం మాట మరిచిపోయావు. మరిచిపోయావనా అన్నాను. కావాలనే వదిలేశావు.

'నేను'లో కొంతకాలమైనా నీ కుటుంబాన్ని ఉంచావు నయం. నువ్వూ నీ భార్యా పిల్లలూ నవ్వితే నీకు ఈ ప్రపంచమంతా నవ్వుల లోకంలో పువ్వులు పూసినట్టు లెక్క.

అవును, నీదంతా లెక్కల లోకం.

లేత గులాబీపై నునులేత మంచు బిందువు సుతారంగా తాకుతున్నప్పుడు అది చూసి ఎప్పుడైనా ఆనందించావా? ఏ మొక్క ఎన్ని గులాబీలను పూసిందో లెక్కేట్టావు. అప్పుడు నీకా పూలతోట రూపాయినోట్ల కోటగానే కనిపించింది.

మనసున మనసై బతుకున బతుకై తోడొకరుండిన అదే చాలునని విరహగీతాలు పాడి, తీరా ఆమె నీదయిన తర్వాత, ఆమెను ఆమెగా కాకుండా పాదదాసిగా, సేవకురాలిగా మార్చేశావు.

ఎందుకలా నవ్వుతావు, ఏదో పెద్ద ఘనకార్యం చేసినట్టు... ఇంట సుఖం లేని బతుకు నరకం సుమీ అంటూ అను 'రాగాలు' ఆలపించి, ఆలపించి చిన్నిల్లు కట్టావు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి ఉపన్యాసాలు దంచావు.

అలా ముఖం చాటేసినట్టు నటిస్తావేం... చిన్నింటామెనూ నిలువునా ముంచావు కదూ!

పక్కవాడి బతుకులోని వసంతాన్ని నక్కలాగా ఎగరేసుకు పోతావు. నీ ఒక్కడి కోసం ఏ ఒక్కరినీ బతకనియ్యరాదని శపథం చేసినట్టున్నావు!

ఎక్కడ చూసినా నువ్వే. తేనె పూసిన నీ కత్తుల నవ్వే.

అనాథ బాలికల హాస్టల్లో వార్డెన్‌గా నువ్వు చరిత్రే సృష్టించావు.

మెల్లగా విచ్చుకున్న తెల్లని మల్లెపూల పరిమళం చల్లగా వీచినప్పుడు, అది నీ ముక్కును తాకలేదు. మల్లెపూల తెల్లని సౌందర్యమే నీకు కనిపించింది. కళ్లు తెరిచే వున్నా మూసుకుపోయాయి కదూ.

ఆ హాస్టల్లో ఎందరి బాలికల బతుకుల్ని నయానా భయానా నలిపిపారేశావో. నీకు ఆడదంటే సెక్స్. మల్లెల గుబాళింపు ఇష్టమని తెలుసుకోలేదు. నీమనసును ఏడు సముద్రాల అవతల మర్రిచెట్టు తొర్రలో కావాలనే దాచేశావు. అందుకే నిశ్చింతగా ఎందరినో దోచేయగలుగుతున్నావు.

ఇసక దేశాల చమురు ఆశలు రేపి, పేద ముస్లిం బాలికలను ధనిక ముసలి తాతలకు కట్టబెట్టి నోట్ల కట్టలెన్నో ఇనప్పెట్టెలో పెట్టావు.

దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అంటూ గొంతెత్తి పాటలు పాడి వందల ఎకరాల మట్టి భూముల్ని సొంతం చేసుకుని, ఆ మనుషులతో చౌకగా పనులు చేయించుకున్నావు.

గోవు మాలచ్చిమికి కోటి దండాలు అంటూ 'ఆవుల్ని పూజింపుము' అని హితోపదేశం చేసి సరసమైన రేట్లకు పశువుల్ని కొని, వాటి మాంసాల్ని విదేశాలకు ఎగుమతి చేసి, సొమ్ము చేసుకున్నావు. చాలకాలం నీ ప్రాంతవాసులు జీవకారుణ్య ప్రదాత అనుకునేలా చేశావు కానీ, నువ్వేమిటో ఆలస్యంగానైనా వాళ్ళు గ్రహించారు.

కంటతడిపెట్టి ఎంతకాలం అయిందో జ్ఞాపకముందా నీకు? సొంత బలం లేకపోయినా అధికారాన్ని సొంతం చేసుకొని, దాన్ని నిలబెట్టుకోడానికి గూండాలచేత అల్లర్లు సృష్టించి, ఎందరి ప్రాణాలనో ఆర్పేశావు. ఆ మర్నాడే వాళ్ల దుర్మరణం పట్ల వేదికలెక్కి శోకాలు పెట్టావు. అవును, అప్పుడే కదూ నువ్వు కంటతడి పెట్టావు. మహానటుడివి నువ్వు.

హసనానికి రాణివి నీవై, వ్యసనానికి బానిస నేనై అంటూ అధికారంలో కొనసాగడానికి ఏం చెయ్యడానికీ వెనుకాడని సాహస వంతుడివి నువ్వు.

భూమి కుంభకోణాల నుంచి బయటపడి, షేర్ల కుంభకోణంలో అడుగు పెట్టావు. షేర్లు నొల్లుకొని బాగా అల్లుకుపోయావు. దొరికినట్టు దొరికి, మరొకర్ని అప్పగించి, నువ్వు చక్కగా జారుకున్నావు.

ఆ అనుభవంతో కుంభకోణాల్లో ఆరితేరి పోయావు. పశువుల నోళ్లు కొట్టి, వాటి దాణా తిని ఆంబోతులా బలిశావు.

ఆఖరికి పచ్చని పైరునూ వదలలేదు నువ్వు. వాటి పేరు చెప్పి, యూరియా స్కామ్‌ను నడిపావు. నీ కోసం ఎందరినో చెడిపావు.

ఎన్నిచేసినా నీకోసమే చేశావు. అందుకోసం కళ్లను చెవులుగా చేసుకున్నావు. చెవులను మెదడుగా చేసుకున్నావు. గోకుడు పుల్లవయ్యావు. అవకాశం దొరగ్గానే బాకుగానూ మారావు.

కొందరి తప్పుల్ని ఒప్పులుగా చేసిన తీర్పరి నువ్వు. ఇంకొందరి ఒప్పుల్ని తప్పులుగా చూపిన నేర్పరి నువ్వు.

కవనాలు అల్లి పవనాలు రేపి పేరు గడించిన సహృదయత నీది. కథలు ఏ అనామకుడిచేతో చెప్పించి, నీ పేరు జోడించి ప్రాచుర్యం గడించిన ఖ్యాతి నీది.

సమతారాజ్యం నినాదాలతో విజృంభించి, "సర్వం నేనే" అని విర్రవీగిన నిగర్వివి నువ్వు.

బాలవీరుడు అభిమన్యుణ్ణి, యుద్ధ నీతికి తిలోదకాలిచ్చి, కత్తులు దూసి నెత్తురు తాగిన పురాణ వీరుల అంశ నీది.

సింగరేణి కార్మికుల సమాఖ్య నాయకుడు మాదిరెడ్డి సమ్మిరెడ్డి ఒక్కడితో రెండొందల మంది పోరాడిన ధీరత్వం నీది. పట్టుకోలేక, అతనున్న ఇంటిని పెట్రోలు పోసి నిప్పంటించిన వీరత్వం నీది.

నీ మేలుకోసం త్యాగం చేసిన వాడిని త్యాగం చెయ్యగలిగిన త్యాగశీలివి నువ్వు.

ఒక్కడికోసం జరుగుతున్న కాల్పుల పోరాటాన్ని చోద్యంగా చూడగలిగిన నిర్భయ శూరత్వం సొత్తుగా నిండిన వేలాది నువ్వు.

ఓరి మందులోడా, ఓరోరి మాయలోడా!

జోహార్, జోహార్, జోహార్!

28.6.96

వార్త దినపత్రిక,